క్లుప్తంగా

ప్రధాని ప్రసంగం పేలవం

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్: ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారసభల్లో మాట్లాడుతున్న తీరు గర్హనీయమని, చేసిన అభివృద్ధిని చెప్పుకోవాల్సిందిపోయి రాజ్యాంగం, రిజర్వేషన్లపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. దక్షిణకాశీ వేములవాడ ఆలయానికి నయాపైసా ఇవ్వని ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం పేరిట వేములవాడకు వచ్చి ఒక్క హామీ ఇవ్వలేదని అన్నారు. ఎంపీగా బండి సంజయ్ ప్రధాని మోదీని వేములవాడకు తీసుకొచ్చి ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో వేములవాడ టెంపుల్‌కు నిధులు కావాలని పార్లమెంట్‌లో ప్రస్తావించానని, ప్రసాద్ స్కీంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను చేర్చాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రాదనే అసహనంతో మోదీ స్థాయి దిగజారి రాజ్యాంగం, రిజర్వేషన్లపై రచ్చ చేస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే చేసిన అభివృద్ధి చెప్పుకుని ఓట్లు అడగాలని, కులాల, మతాల పేరిట ఓట్లు పొంది అధికారంలోకి రావాలనే తీరు గర్హనీయమని అన్నారు. ఎంపీ బండి సంజయ్‌కి ప్రజాసమస్యలు పట్టవని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయలేదని, నవోదయ, ఎయిమ్స్ కళాశాలల కేటాయింపులు లేవని, ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటనలకే పరిమితమైందని బీజేపీ తీరుపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, సర్దార్ రవీందర్ సింగ్, పొన్నం అనిల్, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ శిశువు దత్తత



చెన్నై దంపతులకు శిశువును అప్పగిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: స్థానిక శిశుగృహలో పెరుగుతున్న 4 నెలల శిశువును అధికారులు చెన్నైకి చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా శిశువును వారికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సరస్వతి, డీసీపీవో శాంత, సీడబ్ల్యూసీ మెంబర్ కలింగ శేఖర్, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేశ్, డేటా అనలిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిఫా ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్



సమావేశంలో కార్పొరేటర్ శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: ఢిల్లీలో రెండు రోజులపాటు నిఫా(నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్) జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్‌ను సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ.. పలు స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న నిఫా సంస్థలో భాగస్వామిగా చేరడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం ఆయన రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

ప్రధాని సభకు తరలివెళ్లిన బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: వేములవాడలో బుధవారం నిర్వహించిన ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు నగరంలోని 18వ డివిజన్ నుంచి సుమారు 60 మంది బీజేపీ నాయకులు, మహిళా కార్యకర్తలు శక్తి కేంద్రం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్ రెడ్డి, పింగిలి ప్రతాప్‌రెడ్డి, నాంపల్లి శంకర్, విష్ణుప్రసాద్‌రావు, లక్ష్మీరాజ్యం, గోదరి నరేశ్, మైపాల్ రెడ్డి, భూమయ్య, రమేశ్, అనిత, భూపతి రెడ్డి, రజిత, లింబారెడ్డి, నవీన్‌రావు, వంశీ, భానుచందర్, చంద్రకాంత్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్

శిక్షణకు స్పందన

- కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభించిన క్రీడాశాఖ
- 100 మందికి పైగా హాజరవుతున్న చిన్నారులు
- ఉదయం, సాయంత్రం కొనసాగుతున్న శిక్షణ

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో స్మార్ట్‌సిటీ నిధులతో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టులో బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని కరీంనగర్ జిల్లా క్రీడాశాఖ ప్రారంభించింది. పే అండ్ ప్లే కింద నెల రోజులపాటు శిక్షణ ఇస్తుండగా చిన్నారుల నుంచి స్పందన లభిస్తోంది. కొన్నేళ్లుగా నగరపాలక సంస్థ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. కానీ, ఈసారి ఏర్పాటు చేయలేకపోవడంతో క్రీడాశాఖ ప్రారంభించింది.

క్రేజీ గేమ్..

బాస్కెట్ బాల్ ప్రస్తుతం క్రేజీ గేమ్‌గా మారింది. గతేడాది వేసవి సెలవుల్లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి 200 మందికి పైగా చిన్నారులు హాజరయ్యారు. ఈసారి శిక్షణ శిబిరానికి 100 మందికి పైగా చిన్నారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్‌లు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటలకు శిక్షణ ఇస్తున్నారు.

ఈ ఆట చాలా ఇష్టం



నాకు బాస్కెట్‌బాల్ ఆట చాలా ఇష్టం. 2023 సమ్మర్ క్యాంప్ నుంచి వస్తున్నాను. ఈ గేమ్‌లో అన్ని టెక్నిక్స్ నేర్చుకొని, రాష్ట్ర, జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని, విజయం సాధించాలని ఉంది. చాలా బాగా ట్రైనింగ్ ఇస్తున్నారు. గేమ్ నేర్చుకోవడం హ్యాపీగా ఉంది. – నిక్షిప్త

ఎవ్రీ ఇయర్ తీసుకుంట



అంబేడ్కర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ క్యాంప్‌కు నేను వన్ మంత్ నుంచి వస్తున్నాను. నాకు బాస్కెట్‌బాల్ గేమ్ అంటే ఇష్టం. ఇక నుంచి ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో శిక్షణ తీసుకుంట. – విన్మయ వర్మ

ఫస్ట్ టైమ్ వచ్చాను



బాస్కెట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌కు ఫస్ట్ టైమ్ వచ్చాను. గేమ్ బాగుంది. స్పీడ్‌గా ఆడుతున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వస్తున్నాను. కోచ్‌లు టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. ఈ సెలవుల్లో గేమ్ మొత్తం నేర్చుకుంటా. – సాన్వి

ఆసక్తి పెరిగింది



బాస్కెట్‌బాల్ గేమ్‌పై పిల్లల్లో ఆసక్తి పెరిగింది. చాలామంది శిక్షణకు హాజరవుతున్నారు. జూన్ 5 వరకు శిబిరం నిర్వహిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి. – అరుణ్, కోచ్





చిన్నప్పుడు బాగా ఆడాను



నాకు బాస్కెట్‌బాల్ గేమ్ అంటే ఇంట్రెస్ట్. చిన్నప్పుడు బాగా ఆడాను. అప్పుడు నాకు కాంపిటీషన్‌లో పాల్గొనే చాన్స్ రాలేదు. ప్రస్తుతం మా అబ్బాయి కార్తీక్ రాజ్ ద్వారానైనా ఆ కల నెరవేర్చుకోవాలనుకుంటున్న. – శివాని, పేరెంట్

ఫిజికల్ యాక్టివిటీ ఉండాలని..



పిల్లలకు ఫిజికల్ ఫిట్‌నెట్, యాక్టివిటీ ఉండాలని మా అబ్బాయికి బాస్కెట్‌బాల్ కోచింగ్ ఇప్పిస్తున్నాను. రోజూ శిక్షణకు రావడంతో నేను కూడా రిలాక్స్ అవుతున్నా. వాకింగ్ చేసే టైమ్ కూడా దొరికింది. – ప్రవళిక, పేరెంట్

లాస్ట్ టైమ్ కూడా వచ్చాను



బాస్కెట్‌బాల్‌ను ఆడేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. నేను లాస్ట్ టైమ్ పెట్టిన సమ్మర్ క్యాంప్‌కు కూడా వచ్చాను. ఈసారి లేట్‌గా నిర్వహించారు. బాగా ప్రాక్టీస్ చేసి, బాస్కెట్ బాల్ చాంపియన్‌గా ఎదగాలని ఉంది. – హన్షిత్

2022 నుంచి శిక్షణ



నేను 2022 నుంచి సమ్మర్ క్యాంపుల్లో బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్నాను. ఈ గేమ్ చాలా ఫాస్ట్‌గా ఉంది. చాలా మంది ట్రెనింగ్‌కు వస్తున్నారు. నేను ప్రతీరోజు వస్తున్నాను. ఫ్యూచర్‌లో చాంపియన్ కావాలని ఉంది. అందుకే ఫోకస్ పెట్టి, నేర్చుకుంటున్నాను. – విఖ్యాత్

‘బండి సంజయ్‌కి ఓటు వేయండి’



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: దేశానికి మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి మొలుగూరి కిశోర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని 23వ డివిజన్ ఆదర్శనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఆయన చేసిన అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోజుల తర్వాత రాహుల్‌గాంధీ, కేసీఆర్ దుకాణాలు బంద్ అయిపోతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధ, శారద, సంపత్, రాము, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్, రమాదేవి, శాంత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనాలు.. ప్రత్యేక పూజలు



ప్రవచనం చేస్తున్న స్థలశాయి స్వామి

కరీంనగర్ కల్చరల్: శాతవాహన యూనివర్సిటీ వద్ద గల పీవీఆర్ ఫంక్షన్‌హాల్లో శ్రీమద్రామాయణ మహాక్రతువులో భాగంగా బుధవారం రాత్రి పండితుల ప్రవచనాలు, ప్రత్యేక పూజలు కొనసాగాయి. రామాయణం–ద్వ్యయార్థ ప్రతిపాదకం అనే అంశంపై భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యుడు కొమాండూరి ఇలైవిల్లి స్థలశాయి స్వామి ప్రవచనం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పండితులు, భక్తులు హాజరయ్యారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న ముకుందరెడ్డి

కరీంనగర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాల్లో బుధవారం కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మనువాదాన్ని నెత్తిన మోస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ పౌరులను ఎలా సంఘటిత పరచగలదో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గుజరాత్, మణిపూర్ మారణకాండలు వారి పరిపాలనకు అద్దం పడుతున్నాయని విమర్శించారు. మతాలు, కులాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తే ఓట్లు రాలే రోజులు పోయాయన్నారు. బండి సంజయ్ ఎంపీగా ఉండి, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని విభజన హామీల అమలుకు ఏనాడైనా కృషి చేశారా అని ప్రశ్నించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఆయనను చిత్తుగా ఓడించాలని కోరారు. ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. నాయకులు చిన్న సదాశివ, రాజ్‌కుమార్, వెంకటేశ్, మురళి, భాస్కర్ తదితరులున్నారు.

‘వెలిచాల’కు మద్దతుగా సీపీఎం ప్రచారం

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం, రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా మోసం చేసిందని, నిత్యావసరాల ధరలు పెరగాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తూ, కార్పొరేట్ సంస్థలకు బ్యాంకు రుణమాఫీ చేస్తోందని మండిపడ్డారు. పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేయలేదని, దేడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు కావాలని డిమాండ్ చేస్తుంటే రోజుకు రూ.178 ఇవ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. బీజేపీని గద్దె దించాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేశ్, రాజేశం, నాయకులు రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్, బిల్డర్స్ అసోసియేషన్ల మద్దతు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు టైలర్స్, బిల్డర్స్ అసోసియేషన్లు మద్దతు ప్రకటించాయి. బుధవారం నగరంలోని ఆయా సంఘాల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వెలిచాల విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భాస్కర్, రమేశ్, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ‘గంగుల’ బర్త్‌డే



కేక్ కట్ చేసిన మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, నాయకులు

కరీంనగర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 56వ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని పలుచోట్ల వివిధ సంస్థల నిర్వాహకులు, పార్టీ నాయకులు, గంగుల అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు, రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ చౌక్‌లో భారీ కేక్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, వాహనాదారులకు పండ్లు, పూల మొక్కలు అందజేశారు. 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కరీంనగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, నాయకులు బండారి వేణు, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, రెడ్డవేని మధు, పొన్నం అనిల్, షౌకత్ అలీ, కులదీప్ వర్మ, నవాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేడెట్లు యూనిఫాం సర్వీసుల్లోకి రావాలి

- ఎన్‌సీసీ నిజామాబాద్ గ్రూప్ కమాండింగ్ అధికారి అబ్రహం



ఎన్‌సీసీ కేడెట్లతో అధికారి సునీల్ అబ్రహం

కరీంనగర్‌సిటీ: ఎన్‌సీసీ నిజామాబాద్ గ్రూప్ కమాండింగ్ అధికారి కర్నల్ సునీల్ అబ్రహం బుధవారం ఎస్సారార్ కళాశాలను సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల ఎన్‌సీసీ ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేపడుతోందని, విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నారని తెలిపారు. ప్రతీ కేడెట్ దేశ భద్రత కోసం యూనిఫాం సర్వీసుల్లోకి రావాలని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ తదితర భద్రత దళాల్లో అధికారులుగా ఎంపికయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ మాట్లాడుతూ.. కళాశాలలో ఎన్‌సీసీ విభాగం చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అనంతరం అధికారి అబ్రహంను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నైన్ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి డేనియల్ రోడ్ జామ్, పరిపాలన అధికారి రాజేశ్ సుబేదార్, మేజర్ సాగర్ సింగ్, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రాజు, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, అధ్యాపకులు కిశోర్‌కుమార్, బాలరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేశ్‌కుమార్, ఆర్మీ అధికారులు కపిల్, తోమర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి ‘పొన్నం’ జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంకమ్మతోటలోని ఆయన నివాసానికి వెళ్లి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి కట్ చేశారు. ఎస్సారార్ కళాశాల వాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో, ఇందిరా చౌక్ వద్ద సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 49వ డివిజన్ నాయకుడు జాగిరి సాగర్ గౌడ్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. మాచర్ల ప్రసాద్, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు. 2వ డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లి సహాయ అనాథ పిల్లల స్వచ్ఛంద కేంద్రంలో పిల్లలతో కేక్ కట్ చేయించి, చికెన్ బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. 43వ డివిజన్‌లో కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్స్ అందజేశారు. పీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు ఆధ్వర్యంలో బైపాస్ రోడ్‌లోని వాసవి మాత వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు.

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని సహాయ అనాథ ఆశ్రమంలో బుధవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు బిర్యానీ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మూల కృష్ణారెడ్డి, కాశెట్టి దామోదర్, జునుకుటి భూమయ్య, పోలు రాజ్‌కుమార్, నగేశ్, నాయకులు చెల్లోజు రాజు, కాశెట్టి చిన్న శ్రీనివాస్, బొప్పిశెట్టి శ్రీనివాస్, అశోక్, అంజన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మానగర్‌లో డీటీఆర్ ఏర్పాటు



డీటీఆర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ పంచాయతీ పరిధి ధర్మానగర్‌లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. బుధవారం కొత్త డీటీఆర్ ఏర్పాటు చేయించి, కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో రూరల్ ఏడీఈ రాజు, ఏఈ తిరుపతి, లైన్‌మెన్ ప్రకాశ్, కాంట్రాక్టర్ సత్యనారాయణ, లింగంపల్లి సాయిబాబాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం ఆరబెట్టేందుకు తిప్పలు



చామనపల్లిలో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతులు

కరీంనగర్‌రూరల్: అకాల వర్షం అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళవారం రెండుసార్లు కురిసిన వానకు కరీంనగర్ మండల కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసి ముద్దయింది. టార్పాలిన్లు కప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ధాన్యం తడవడంతో బుధవారం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కాంటా పెట్టలేదు. దీంతో చెర్లభూత్కూర్, బొమ్మకల్, చామనపల్లి, జూబ్లీనగర్, నగునూరు తదితర గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సకాలంలో కాంటా పెట్టకపోవడమే ఈ పరిస్థితికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

సప్తగిరికాలనీ: కోట స్మితారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ఆమె కుమారులు అర్జున్‌రెడ్డి, విరాట్‌రెడ్డి కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమానికి రూ.8 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రధాని మోదీవి మాయ మాటలు’



మాట్లాడుతున్న వేణుగోపాల్

విద్యానగర్: ప్రధాని మోదీ మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపదను బడా వ్యాపారులకు దోచి పెడుతున్నారన్నారు. ఆయన పదేళ్ల పాలనలో రూ.113 లక్షల కోట్ల అప్పులు తప్ప దేశానికి ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. రూ.60 లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ రంగ సంస్థలను కేవలం రూ.6 లక్షల కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో నాయకులు బోయినపల్లి చంద్రయ్య సిగిరి శ్రీధర్, గజ్జల ఆనందరావు, రామ్మూర్తి, బాపురెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.